క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ఇల్లంతకుంట: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌చార్జి సీఐ ప్రణీత్ గౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, టాస్క్‌ఫోర్స్ ఎస్సై శైలజ, ఎంఈవో శ్రీనివాస్ గౌడ్, హెచ్ఎం ప్రేమలత, ఉపాధ్యాయ సిబ్బంది ,పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన



ప్రచార పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

గంభీరావుపేట: మండలంలోనిమ గజసింగవరంలో లింగన్నపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సిబ్బంది గురువారం క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధి లక్షణాలు, నియంత్రణ, చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, టీబీ సూపర్‌వైజర్ మహిపాల్, సీహెచ్‌వో రమేశ్, టీబీ నోడల్ అధికారి అమరావతి, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, హేమ, భారతి, ఏఎన్ఎం రాణి, రాజేశ్వరి, అనసూయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఇల్లంతకుంట: రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎంఏ ఫారుఖ్ అన్నారు. గురువారం రహీంఖాన్‌పేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఇప్పటివరకు 970 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐలు శశి, సంతోష్, వీఆర్వో సింగారెడ్డి, కృష్ణ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ ద్వారా ఎంపిక చేయాలి

గంభీరావుపేట: మండలకేంద్రంలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో 38 ఇళ్లు ఖాళీగానే ఉన్నాయని, వాటిని గ్రామసభ నిర్వహించి అర్హులైన పేదలకు కేటాయించాలని పలువురు గురువారం తహసీల్దార్ మారుతిరెడ్డికి వినతిపత్రం అందించారు. తమకు జాగ, ఇళ్లు లేవని తమలాంటి పేదోళ్లకు డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ బహుజన బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముద్రకోల ఆంజనేయులు పలువురు పేద మహిళలు పాల్గొన్నారు.

రూ.లక్ష చెక్కు అందజేత

బోయినపల్లి: మండలంలోని తడగొండకు చెందిన కుంటాల హరీశ్ ఇటీవల మృతిచెందాడు. ప్రభుత్వం తరఫున మంజూరైన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం బాధిత కుటుంబానికి అందించారు. ఇక్కడ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, ఏఎంసీ చైర్మన్ ఎల్లేశ్‌యాదవ్, సెస్ డైరెక్టర్ కొట్టిపెల్లి సుధాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, వీసీ నిమ్మ వినోద్‌రెడ్డి, ఉయ్యాల శ్రీనివాస్, ఎండీ.హుస్సేన్, సంబ లక్ష్మీరాజం తదితరులు ఉన్నారు.

పోడు భూముల సమస్యలు పరిష్కరించాలి

వీర్నపల్లి: మండలకేంద్రంలో పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకుడు మల్లారపు అరుణ్ కుమార్, జాలపెల్లి మనోజ్ కుమార్ మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని, 60 ఏళ్లుగా నిరుపేద రైతులు పోడు వ్యవసాయం చేసుకుంటున్న భూముల్లో ఫారెస్ట్ అధికారులు ప్లాంటేషన్ పెట్టడం సరికాదన్నారు. పనులు నిలిపివేసి సాగు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. రైతులపై అక్రమకేసులు ఎత్తివేయాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేరిక

ఎల్లారెడ్డిపేట: వెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాలలో కూలీల పిల్లలను గురువారం మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు చేర్పించారు. మహారాష్ట్రకు చెందిన లచ్చయ్య కట్టెల కొంతకాలంగా హరిదాస్‌నగర్‌కు చెందిన లక్ష్మణ్‌రావు వ్యవసాయ క్షేత్రంలో పని చేస్తున్నారు. తల్లిదండ్రులతోపాటు వ్యవసాయ పనులు చేస్తున్న పిల్లలను లక్ష్మణ్‌రావు వారిని బడిలో చేర్పించారు. అవంతి, ఆదర్శను వెంకటాపూర్ పాఠశాలలో చేర్పించగా, వారి చదువులకు అయ్యే ఖర్చులను తానే భరిస్తానని లక్ష్మణ్‌రావు హామీ ఇచ్చారు.

రోడ్లను కమ్మేస్తున్నాయి



ఎన్గల్ శివారులో రోడ్డుపైకి వస్తున్న ముళ్ల కంప



హన్మాజిపేట - ఎన్గల్ రోడ్డు వెంట వాహనాలకు తగులుతున్న చెట్ల కొమ్మలు

- రోడ్లపైకి వస్తున్న చెట్లకొమ్మలు
- రాకపోకలకు తిప్పలు
- ముళ్ల చెట్లు తగిలి వాహనదారులకు గాయాలు
- పట్టించుకోని అధికారులు

చందుర్తి: మండలంలోని పలు గ్రామాల్లోని ఆర్అండ్‌బీ రోడ్లను ముళ్ల చెట్లను కమ్మేస్తున్నాయి. ఈ రహదారులపై రాకపోకలు సాగించేందుకు అడ్డుగా ఉంటున్నాయి. రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా ఎదిగి రోడ్లపైకి వస్తున్నాయి. ద్విచక్రవాహనాదారులు చెట్ల కొమ్మలు తగిలి గాయాలపాలవుతున్నారు. భారీ వాహనాలు ఎదురెదురుగా వస్తే ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు వారు పేర్కొంటున్నారు. .

పర్యవేక్షణ కరువు

మండల పరిధిలోని హన్మాజీపేట శివారు నుంచి ఎన్గల్, బండపల్లి వరకు, మూడపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి అనంతపల్లి, నర్సింగాపూర్, తిమ్మాపూర్, రామన్నపేట వరకు, మర్రిగడ్డ నుంచి జోగాపూర్, కిష్టంపేట, రామరావుపల్లె , సనుగుల గ్రామం వరకు, వేములవాడ –కోరుట్ల ప్రధాన రహదారి చందుర్తి మండల పరిధిలోని ఆర్అండ్‌బీ రోడ్లపై పర్యవేక్షణ కరువైంది. రోడ్లకిరువైపులా నాటిన హరితహారం మొక్కలు ఏపుగా ఎదిగి వృక్షాలుగా మారాయి. విద్యుత్‌తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలను సెస్ సిబ్బంది, రైతులు కొట్టి రోడ్డు పక్కనే వదిలేస్తున్నారు. దీంతో వాహనాలకు సైడ్ ఇచ్చే సమయంలో చెట్ల కొమ్మల మధ్య వాహనదారులు పడిపోతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం లేదు. నిధులు లేవన్న సాకుతో రోడ్లపై అధికారులు కన్నెత్తి చూడ డం లేదని ఆయాగ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

రవాణాకు అడ్డంకిగా

మండల పరిధిలోని ఎన్గల్ నుంచి వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట మధ్య చెట్లు ఏపుగా ఎదగడంతో చెట్ల కొమ్మలు బస్సు, లారీల అద్దాలు తగలడంతో నడిరోడ్డుపై వెళ్తున్నారు. ఈ సమయంలో ద్విచక్రవాహనదారులు తారురోడ్డు అంచులపై ప్రయాణం సాగించలేక భారీ వాహనాలు వెళ్లి పోయేవరకు వాహనాలను నిలుపుతున్నారు. చెట్ల కొమ్మలను తొలగించాలని పలుసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

సైడ్ బర్మ్స్ ఊసేలేదు

వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట నుంచి చందుర్తి మండలం ఎన్గల్, బండపల్లి గ్రామాల మీదుగా కోనరావుపేట మండలం బావుసాయిపేట వరకు రోడ్డువేసి రెండేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని, కాంట్రాక్టర్ సైడ్ బర్మ్స్‌కు ఇరువైపులా మొరం పోయించడం మరిచిపోయారు. దీంతో తరుచూ వాహనాలు రోడ్డు దిగిన సమయంలో అదుపు తప్పి బోల్తా పడుతున్నాయి.

పట్టించుకోవడం లేదు



ఆర్అండ్‌బీ అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. తారు రోడ్డు వేసి రెండేళ్లు గడుస్తున్నా సైడ్‌బర్మ్స్ వేయకపోవడంతో తరుచూ వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. పలుసార్లు విన్నవించినా అధికారులు నిధులు లేక పనులు చేయించడం లేదని నిర్లక్ష్యంపు సమాధానమిస్తున్నారు.

– అంబాల శ్రీకాంత్, బండపల్లి

చెట్లకొమ్మలు తొలగించాలి



ఎన్గల్ నుంచి హన్మాజీపేట ఎక్స్ రోడ్డు వరకు రోడ్డుకిరువైపులా చెట్లు ఏపుగా ఎదగడంతో భారీ వాహనాలు వచ్చినపుడు చెట్ల కొమ్మలు అడ్డు తగిలి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా భారీ వృక్షాలను గుర్తించి వాటిని తొలగించాలి. ప్రయాణికులు సాఫీగా రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.

– మ్యాకల జలేందర్, యువకుడు, ఎన్గల్

సమస్యల పరిష్కారానికి కృషి

“సెస్ సిబ్బంది నరికిన చెట్ల కొమ్మలను రోడ్డు పక్కనే వేయకుండా చర్యలు తీసుకుంటాం, రోడ్డుపై అడ్డు తగుల చెట్ల కొమ్మలను త్వరలోనే తొలగించి సమస్యను పరిష్కరిస్తాం, రోడ్డు మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేస్తాం. సైడ్ బర్మ్స్‌పనులు చేయించేలా చూస్తాం.

– నవ్యశ్రీ, ఆర్ అండ్ బీ ఏఈ, చందుర్తి”

హామీలు అమలుచేయని కాంగ్రెస్



మాట్లాడుతున్న కల్వకుంట్ల గోపాల్‌రావు

ముస్తాబాద్: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేయడం లేదని, గత సీజన్‌తోపాటు ఈ వానాకాలం సీజన్‌లో రైతు భరోసా డబ్బులు పడటంలేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కల్వకంట్ల గోపాల్‌రావు విమర్శించారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం విలేరులతో మాట్లాడారు. గత యాసంగి సీజన్‌లో కనీసం రెండెకరాలున్న రైతులకు కూడా రైతుభరోసా అందలేదన్నారు. రైతులను మభ్యపెట్టి, ఓట్లు దండుకుని ఇప్పుడు మోసం చేశారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదన్నారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, మాజీ సర్పంచ్ నల్లనర్సయ్య, శీలం స్వామి, మనోహర్, భరత్, సావిత్రి, జహంగీర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న ప్రవీణ్ జే టోని

తంగళ్లపల్లి: అంకుసాపూర్ మాజీ ఎంపీటీసీ కరికబోయిన కుంటయ్య ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమే అయినా కేటీఆర్ ఈ విషయంతో శవరాజకీయాలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుంటయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు కూడా నమోదైందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే చనిపోయాడని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మల్యాల నాగరాజు వద్ద కుంటయ్య భూమిని కొనుగోలు చేశాడని అతడిపై ఫిర్యాదు చేయగా రిమాండ్ అయినట్లు తెలిపారు. కుంటయ్య కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. తప్పుడు ఆరోపణలు మానుకోవాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు లింగాల భూపతి, చుక్క రాజశేఖర్, మునిగెల రాజు, హారికా రెడ్డి, అరెపల్లి బాలు, పొన్నాల పరుశరాములు, మిరాల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా పోలీస్ సేవలు



సీఐ మొగిలి

సిరిసిల్లక్రైం/ తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ మాజీ ఎంపీటీసీ కరికవేణి కుంటయ్య మృతిపై పట్టింపు లేకుండా వ్యవహరించినట్లు పోలీసులపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి వెల్లడించారు. పోలీసులను ఆశ్రయించి రక్షణ కోసం ఏ ఫిర్యాదు చేసిన నిష్పక్షపాతంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. 2023, ఆగస్టు 25న కరికవేణి కుంటయ్య తనకు లేని భూమి రిజిస్ట్రేషన్ చేశాడని మల్యాల నాగరాజుపై ఫిర్యాదు చేయగా.. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో మల్యాల నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 2024, డిసెంబర్ 12న మరో భూమి విషయంలో కరికవేణి కుంటయ్య తనను మోసం చేశాడని గంగా కిష్టారెడ్డి ఫిర్యాదుతో తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు వివరించారు. ఈ రెండు కేసులపై దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. పోలీసులు భూమి సంబంధిత అంశాలు, సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశారు. సివిల్ వివాదాలను ప్రజలు న్యాయస్థానంలోనే పరిష్కరించుకోవాలని కోరారు.

మహిళా డిగ్రీ కళాశాలలో యోగా వేడుకలు



యోగాలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

వేములవాడరూరల్: పట్టణంలోని శాత్రాజుపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. యోగా శిక్షకులు వై.కృష్ణ, బి. రిషిక విద్యార్థినులు, అధ్యాపకులకు యోగాతో కలిగే ప్రయోజనాలపై వివరించారు. కార్యక్రమంలో డా. శ్వేత, లావణ్య, సుమలత, స్వప్న, దేవిక, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వీర్నపల్లి: మండలంలోని సీతారాంనాయక్ తండా, జవహర్ లాల్ తండా, మద్దిమల్లలో వైద్యాధికారి స్నేహ రక్తహీనతపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరం నిర్వహించి 167 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏఎన్ఎంలు సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పొత్తూరు ఎస్సీ కాలనీలో గురువారం మురుగునీటి కాలువలు పరిశుభ్రపర్చారు. అనంతరం మండల వైద్యసిబ్బంది ఎస్సీ కాలనీలో ఇంటింటా జ్వర సర్వేచేశారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో వైద్యశిబిరం ఏర్పాటు చేసి 39 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాలలో వర్షాలు కురవాలని కోరుతూ గురువారం రైతులు కప్పతల్లి ఆట ఆడారు. తొలకరి జల్లులకు పత్తిపంటలు వేసిన రైతులు వర్షాలు ముఖం చాటేయడంతో విత్తనాలు మొలకెత్తక ఇబ్బంది పడుతున్నారు. పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



యూపీఎస్సీ ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే యూపీఎస్సీ 2026 పరీక్ష కోసం గిరిజన ఐఏఎస్ స్టడీసర్కిల్‌లో ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి ప్రకటనలో తెలిపారు. htt p://rt ud ycirc e.cf-f.gov.i n వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహించి అర్హులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. జూలై 4లోపు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 62817 66534లో సంప్రదించాలని సూచించారు.

క్రీడా పాఠశాలలకు ఎంపిక పరీక్ష

కోనరావుపేట: హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు మండలస్థాయిలో ఎంఈవో మురళినాయక్ ఆధ్వర్యంలో గురువారం ఎంపిక పరీక్ష నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన 22 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 14 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 23 నుంచి 26 వరకు జిల్లాస్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు సంతోష్, అజయ్, రేణుక, వనిత, వెంకటేశ్, పీఈటీలు హెప్సిబా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగాపూర్ హైస్కూల్‌లో..

బోయినపల్లి : స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఎంపిక పరీక్షలను నర్సింగాపూర్ హైస్కూల్‌లో నిర్వహించారు. పోటీ పరీక్షలకు మొత్తం 8 మంది హాజరయ్యారు. వీరికి పరీక్షలు నిర్వహించి జిల్లా స్థాయి పోటీ పరీక్షలకు పంపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీ ఎస్. శ్రావణ్ కుమార్, పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్రెస్‌క్లబ్ కార్యవర్గం



ఎమ్మెల్యే సత్యంకు పూలబొకే ఇస్తున్న కార్యవర్గం

బోయినపల్లి: పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం గురువారం ఎమ్మెల్యే సత్యంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పట్నం ప్రసాద్, నల్లగొండ వేణుగోపాల్, గడ్డం తిరుపతి, గజ్జెల శ్రీను, అతికం రాజశేఖర్, కూస రవి, గణేశ్ తదితరులున్నారు.



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని మురుగుకాలువలు ప్రమాదకరంగా మారాయి. మురుగు కాలువలపై రక్షణగా ఏర్పాటు చేయాల్సిన సిమెంట్ బిల్లలు వేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల డ్రైనేజీలపై అధికారులు బిల్లలు వేసి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా అధికారులు మురుగు కాలువలపై రక్షణగా సిమెంట్ బిల్లలు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
ప్రవీణ్‌కుమార్, ఈవో, ఎల్లారెడ్డిపేట: సెల్: 8074 541 033

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న మృత్యుంజయం

గంభీరావుపేట: రైతులకు రైతు భరోసా అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేయడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ మండల నాయకులు గురువారం సంబురాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మృత్యుంజయం మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు హమీద్, నాయకులు రాజవీర్, దేశెట్టి రాజశేఖర్, లక్కం నాంపల్లి, కోట లింగం, జంగం రాజు, మూల రాంచంద్రారెడ్డి, వంగ రాఘవేందర్‌రెడ్డి, అక్కపల్లి బాలయ్య, జంగ కాశీరాములు, కూడెల్లి ప్రవీణ్‌కుమార్, లక్ష్మినారాయణ, వెంకటి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'సెస్ అధికారులపై చర్యలు తీసుకోండి'

కోనరావుపేట: ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పొలాల వద్ద స్టార్టర్లు తొలగిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కోనరావుపేట ఏఈ, లైన్‌మెన్‌లపై చర్యలు తీసుకోవాలని కొలనూరు గ్రామానికి చెందిన రైతు ఓరగంటి శంకర్ సీఎం రేవంత్ రెడ్డికి ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేశారు. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ ఎక్కువైందని రైతుల పొలాల వద్ద స్టార్టర్లను ఏఈ, సిబ్బంది తీసుకెళ్లారన్నారు. ఈ విషయమై లైన్‌మెన్ శ్రవణ్‌ను ప్రశ్నిస్తే ఏఈ తీసుకురమ్మన్నారని చెప్పారన్నారు. తిరిగి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని రైతులు అడిగితే ఏఈ, అధికారులు, సిబ్బంది దురుసుగా ప్రవరిస్తున్నారన్నారు. బాధ్యులపై వెంటనే తగు చర్యలు తీసుకొని రైతుల వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించాలని ట్విట్టర్‌లో విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలెక్టర్‌కు తెలిసేలా ట్విట్టర్‌లో ఫిర్యాదును ట్యాగ్ చేశారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



సిరిసిల్ల టౌన్ : గాంధీచౌక్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వేములవాడ అర్బన్: తిప్పాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్/వేములవాడ రూరల్ /ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/ముస్తాబాద్/రుద్రంగి : ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, పట్టణ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. కేక్ కోసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంగల కనకయ్య, ఉపాధ్యక్షుడిగా గడప సంతోష్, సెక్రటరీగా గడప ప్రవీణ్, కోశాధికారిగా కూర శ్రీధర్, ప్రచార కార్యదర్శిగా మానుకోల నర్సయ్య ఎన్నికైన సందర్భంగా మాజీ అధ్యక్షుడు, పాలకవర్గం కొత్త పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుల పాలకవర్గం మూడరి రాజ్ చిన్న, వంగల రాజ్, గడప లక్ష్మణ్, గడప ప్రశాంత్, కూర నర్సయ్య, గడప కృష్ణహరి, వంగల నరేశ్, భాస్కర్, అశోక్, శ్రవణ్, మూడరి శ్రీనివాస్, గడప రమేశ్, పోచెల్లయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యుడు రవీందర్‌రావు మృతి

బోయినపల్లి: కోరెం గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు చెన్నాడి రవీందర్‌రావు (85) అనారోగ్యంతో మృతి చెందారు. కరీంనగర్‌లో ప్రముఖ సర్జన్‌గా పేరు పొందిన రవీందర్‌రావు ఎంతోమందికి పలు శస్త్రచికిత్సలు చేశారు. గురువారం స్వగ్రామం కోరెంలో జరిగిన ఆయన అంత్యక్రియల్లో మ హా రాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే సత్యం, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్‌రా వు, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ తదితరులు పాల్గొని నివాళి అర్పించారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

కోనరావుపేట: మండలంలోని కనగర్తి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్‌ను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వినోద్‌కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ భూంరెడ్డి, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, తదితరులున్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పొత్తూరు, కందికట్కూర్ హరిజన వాడ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మోలుగూరి రాజు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యకరమంలో మహిళా మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు వెలిచాల జ్యోతి, ఆకుల సత్యం, కరుణాకర్‌రెడ్డి, బిగుళ్ల విజయ్, తిరుపతి, ప్రధానోపాధ్యాయుడు రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించిన సిబ్బంది

సాక్షి స్పందన

ముస్తాబాద్: ముస్తాబాద్-పోతుగల్ రహదారిపై పంచాయతీ సిబ్బంది గురువారం తొలగించారు. కొందరు రోడ్డుపై చెత్త పారబోయడంపై సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చెత్త పారవేయవద్దని బోర్డులు పాతినా కొందరు పట్టించుకోవడం లేదని ఈవో రమేశ్ అన్నారు. చెత్తను పంచాయతీ ట్రాక్టర్లు, ఆటోలకు అందించాలని కోరారు.